**1981 సంక్రాంతి కథల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ**

విశాల హర్మ్యంలా ఉన్న ఆకాశంలో చంద్రుడు చుక్కల్ని చుట్టూ చేర్చుకుని రమ్యంగా సరసాలాడుతున్నాడు. తెల్ల మబ్బులు ఆ సరసాలు చూస్తూ సిగ్గుపడి మెల్లగా సాగిపోతున్నాయి. ఆ తెల్ల మబ్బులు రథంలా, రాజకుమారుడిలాగా ఒక్కొక్కసారి ఒక్కొక్క ఆకారంలో కనిపిస్తున్నాయి.

మంకెన పువ్వులాంటి పెదవులు. తెల్లమబ్బులలాంటి చూపులతో డాబామీద రాధ వుంది.

రాధకి అందం ఇష్టం. అందమైన పరిసరాలు ఇష్టం. అందమైన ఊహాలు ఇష్టం.

రాధ భర్త రాజారావు రాకపోవడంతో రాధ ఒంటరిగా ఉంది.

చందమామని చూసినప్పుడల్లా రాధకి వదూధిని అక్కయ్య. అక్కయ్య మాటలు గుర్తుకు వస్తాయి. అక్కయ్య ముఖం మీద బ్యూటీ స్పాట్ గుర్తుకు వస్తుంది.

అక్కయ్య పెళ్ళి రాధకి బాగా గుర్తు. పెళ్ళికొడుకు అందంగా వున్నాడు. సాధారణంగా మగవాళ్ళు మొదటి చూపుకి అందంగా వుండరు. ప్రజ్ఞవల్లగాని, తీవి, రాజసంవల్లగాని ప్రేమవల్లగాని అందంగా కనిపిస్తారు. కాని ఈ పెళ్ళికొడుకు అలా కాదు. మొదటిచూపుకే బాగున్నాడు.

పేరుకూడా అందమైన పేరు. రాజేష్.

తన భర్త పేరు? రాజారావు. చాలా సాధారణంగా ఉంది.

ఆ పేరు నచ్చలేదు రాధకి. పేరు మార్చుకోమని చాలాసార్లు చెప్పింది. "రాజా అనిగాని. రాజశేఖర్ అనిగాని ఉంటే బాగుంటుంది" అంది. "ఇప్పుడు మార్చడం ఎందుకు?" అని భర్త అంటే దెబ్బలాడింది.

రాజారావుకి రాధ అంటే యిష్టం. కాని రాధకి అసంతృప్తి. గెజెటెడ్ ఆఫీసరు లాంటి హోదా, దర్జాతో. మంచి డ్రస్సుతో తనని వెంట తిప్పుకునే భర్తని తను వూహించుకుంది. మంచి డ్రస్సు కుట్టించుకోమని దెబ్బలాడుతుంది. తన జీతం, బట్టలకయే ఖర్చు లెక్క చెబుతాడు అతను.

రాజేష్ అయితే ఇలా అంటాడా? 'నీకు ఏది యిష్టం అయితే అలాగేచేస్తాను' అంటాడు. మర్నాడు సాయంత్రానికి నాలుగు జతలు కుట్టించుకు వస్తాడు. డబ్బు విషయమే ఎత్తడు. అసలు డబ్బుగురించి ఆలోచించి వెనక్కుతీసే మగాడు ఏం మగాడు?

రాధకి ఇలాంటి సందర్భాలలో భర్తపై కోపం వచ్చేస్తుంది. మామూలుగా వుండే అసంతృప్తికి ఈ కోపంతోడై ఆ రోజు దాంపత్యవనంలో చిరుమంటలు లేస్తాయి.


అక్కయ్య పెళ్ళిపీటలమీద కూర్చున్నప్పుడు ఎంతగర్వం, అందమైన మొగుడు దొరికాడని. అక్కయ్య గురించి తనకి అసూయ లేదు. కాని తనకికూడా అలాంటి మొగుడే దొరికితే ఎంత బాగుండేది! అక్కయ్య పెళ్ళిఫొటోలు ఎన్నిసార్లు చూసినా బాగుంటాయి

రాజేష్‌లో పేరుకి తగ్గ సరసం ఉందని అక్కయ్య మాటల్లో తెలుస్తూనే ఉంది.

పెళ్ళయిన మూడు నెలలకి వదూధినక్కయ్య దసరాకి ఇంటికి వచ్చినప్పుడు ముఖంమీద, గడ్డం దగర పక్కగా నల్లటి పెద్ద చుక్క బొట్టు పెటుకొచ్చింది. ఆ బొటు అక్కయ్య ముఖానికి చాలా అందాన్నిచ్చింది.



కె. సూర్యనారాయణమూర్తి



కె. రామచంద్రరావు

సోదరులమైన మేము 'కాశీనాథ & కాశీనాథ' కలం పేరుతో 1964 సంవత్సరం నుంచి కథలు రాస్తున్నాము. వివిధ వార, మాస పత్రికల్లో మా కథలు ప్రచురితమయ్యాయి. 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రికలో ప్రచురించబడిన మా కథలలో మొదటిది 1968వ సంవత్సరంలో ప్రచురించబడింది.

మా గురించి ఇతర వివరములు :

కె. సూర్యనారాయణమూర్తి చదువు : సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా. ఉద్యోగం : ఖమ్మం జిల్లా, కల్లూరులో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ విభాగంలో సూపర్ వైజర్.

కె. రామచంద్రరావు చదువు : M. Sc. ఉద్యోగం : ఒంగోలు, శ్రీ C. S. R. శర్మ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్.

మా అభిమాన రచయిత శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ. హాబీ శ్రీ బాపు బొమ్మలు సేకరించడం.

కె. సూర్యనారాయణమూర్తి
కె. రామచంద్రరావు

# బ్యూటీ స్పాట్

కాశీనాథుని కాశీనాథ



"ఏమిటది?" అంది రాధ.

"బ్యూటీ స్పాట్" అంది వరూధిని.

"అంత పెద్దగా కుంకుమబొట్టు సైజులో పెట్టుకుంటారుటే? బ్యూటీ స్పాట్ అంటే రంగు పెన్సిలు చుక్కలాగా ఉండాలి" అంది రాధ.



పరీక్షల్లో ఉత్తమమైనదని తేలింది.
నాథ్ పీటర్స్
హైదరాబాద్-500 659

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక పేసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

సర్ప [నైట్ పిల్స్]
(మదన కామేశ్వరి గులిగా)

బలహీనత, ఒళ్ళు బలహీనత, నిద్ర లేక బాధపడే వారు, చిన్నతనములో తెలియక చేసిన తప్పువల్ల మానసికంగా బాధపడేవారు, జీవిత సుఖం లేనివారు, పిల్లలు లేనివారు. ఇంక అన్ని బలహీనతలు, మన సిద్ధ వైద్యముతో నయమవుతుంది. వెంటనే మా సిద్ధ సంజీవి అయిన "సర్ప" వాడండి
30 మాత్రలు 25-00. 60 మాత్రలు 40-00 వి.పి.పి. చార్జీ 5-00. మందు కావలసినవారు ముందు డబ్బు పంపించి మందు పుచ్చుకోవలయును. 30 మాత్రలకు తక్కువ పంపము.
**Karthikeya Vaidyasalai,**
PALNI P.O. Pin 624601.
Phone 606.

"పెసర బద్ద అంత వుంటే బాగుంటుంది" అంది వాళ్ళ బామ్మ. ఆవిడ ఏం మాటాడినా వంటసామానుతోనే పోలుస్తుంది.

"... మజ్జిగలోకి అన్నం ఎక్కువవద్దు కరక్కాయ అంత పెట్టు...."

"... ఇది నామా తరకాదే. నావి బీరునాలో వుంటాయి. కందిగింజలంత వుంటాయి. అవి పట్టా...."

"... ఇదేమిట్రా నీ పుస్తకంలో బొమ్మ పంచపాత్రలాగా ఉంది. దీన్నేమంటారు? ... కలరా మీటరా? .... సరిగ్గా చెప్పకుండా నవ్వుతావేమిట్రా వెధవా.... కెలరీ మిటరా. నీ మొహం. పంచపాత్ర అనమన్నానని మీ మాస్టరుకి చెప్పు."

ఇలా ఉంటాయి బామ్మ మాటలు.

"మా ఆయనకి ఇదే ఇష్టం" అంది వరూధిని.

"చిన్న స్పాట్ ఆయనకి నచ్చదా?"

"మా ఆయన పెద్దదే పెట్టుకోమన్నారు. దగ్గరుండి తనే స్పాట్ దిద్దుతారు కూడా. స్పాట్ పెట్టుకోందే ఊరుకోరు"

రాధ ఒళ్ళు ఝల్లుమంది. "ఎందుకు?" అంది. ఇలాంటి సరదా రాజారావులో కాగడా వేసినా కనిపించదని రాధ ఇప్పటి బాధ.

"దానికి ఓ కథ వుంది." అంది వరూధిని అక్కయ్య. కథ అనగానే రాధ ఇంకాస్త దగ్గరగా జేరింది.

వరూధిని చెప్పింది

"ఒకసారి వెన్నెల్లో డాబామీదకూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. చుక్కలు. చందమామకేసి చూస్తున్నారు ఆయన. నేనెన్ని కబుర్లు చెప్పినా వినటం లేదు ఆఖరికి పలికారు. "ఏమిటి ఆలోచిస్తున్నారు?' అన్నాను.

"ఆ చందమామకే మచ్చ దేనికి?" అన్నారు. "దిష్టితగలకుండా వుండడానికి" అన్నాను "కాదు. చందమామ తెలదనానికి ఆ మచ్చ నల్లగనం కాంట్రాస్టుగా పనిచేసి తెల్లదనం ఇంకా ప్రస్ఫుటంగా కనిపించేటట్టు చేస్తుంది" అన్నారు. అని నాకేసి తిరిగి "రెండో చందమామకిమచ్చ లేదే?" అన్నారు. "రెండో చందమామ ఏమిటండీ? ఆకాశంలో రెండు చందమామ లుంటాయా?" అన్నాను తెలిసి కూడా

"ఉండవు. కానీ ప్రస్తుతం ఆకాశం మీద ఒకటి, డాబామీద ఒకటి ఉన్నాయి" అన్నారు. ఆ రోజు అప్పటికప్పుడు బ్యూటీస్పాట్ పెట్టుకునేదాకా నిద్రపోనివ్వలేదు" అంది.

రాధకి ఒళ్ళు పులకరించింది.

దసరా అవగానే అక్కయ్య వెళ్ళిపోయింది.

* * *

మళ్ళీ సంక్రాంతికి వచ్చింది వరూధిని.


"అక్కా బ్యూటీస్పాట్ కథ మళ్ళీ చెప్పవే?" అంది రాధ.

"ఎందుకు?"

"బాగుంది ఇంకోసారి వినాలనిఉంది".

"సరే"అని మొదలుపెట్టింది వరూధిని.

"నేను, మీ బావగారు ఒకసారి ఎవరో పుట్టిన రోజు పార్టీకి వెళ్ళాము. ఒక అమ్మాయి ఎవరో కొవ్వొత్తుల్ని ఆర్పుతోంటే అందరూ చప్పట్లు కొడుతున్నారు. "ఈ పద్ధతికి అర్థం ఏమిటి?" అని అడిగాను మీ బావగారిని. "పుట్టిన రోజు జరుపుకుంటున్న వాళ్ళకి ఎన్నేళ్ళ వయసుంటే అన్ని కొవ్వొత్తులు వెలిగిస్తారు." అన్నారు. నేను కొవ్వొత్తులు లెక్కపెట్టాను. పద్దెనిమిది వున్నాయి. "ఆ అమ్మాయికి పద్దెనిమిదేళ్ళా?" అన్నాను.



"అంతే అయి వుంటుంది" అని పైకి మామూలుగా అని, పక్కనెవరూ లేనప్పుడు రహస్యంగా "ఆడవాళ్ళమీద ఒక జోక్ వుంది తెలుసుగా. ఆడవాళ్ళకి వయసు పద్దెనిమిదేళ్ళవరకూ సంవత్సరాలలెక్కలో పెరిగి ఆ తర్వాత నెలల లెక్కలో పెరుగుతుందిట" అని నవ్వారు. నాకూ నవ్వొచ్చింది. తర్వాత "పద్దెనిమిదికన్నా ఎక్కువ వయసున్నాకూడా పద్దెనిమిది కొవ్వొత్తులే వెలిగిస్తారు" అన్నారు. క్షణం ఆగి "అయినా ఈ అమ్మాయిని చూస్తుంటే ప్రతీ కొవ్వొత్తినీ రెండేసి ముక్కలుచేసి అన్నీ వెలిగించవచ్చుని పిస్తోంది అన్నారు" అని ఆగింది వరూధిని

రాధకి కథ బాగుంది. అందుకని అడ్డు పడలేదు. కాని ఇక్కడిదాకా వచ్చాక అక్కయ్య ఆగినప్పుడు అవకాశం దొరకగా 'నేను బ్యూటీస్పాట్ కథ చెప్పమన్నాను. నువ్వు ఇంకేదో చెబుతున్నావు' అంది

"అదే చెప్పేది" అంది వరూధిని.

"ఇది రకు వేరే కథ చెప్పావు".

"ఇప్పుడు చెప్పేది ఇంకోకథ. ఇదీ బ్యూటీ స్పాట్ కథే, పూరిగావిను" అంది.

అక్కయ్య రచయిత్రి. చెప్పినకథ చెప్పదు

అక్కయ చెప్పడం కొనసాగించింది.

"ఆ పార్టీకి వచ్చినవాళ్ళలో ఒక అమ్మాయి నా కంటికి చాలా బాగుంది ఆయన్ని కూడా చూడమన్నాను. "ఎవ రేజ్‌గా వుంది" అన్నారాయన పెదిమ విరిచి. నా మెప్పుకోసం అలా అని వుంటారు ఆ అమ్మాయి బాగుందని నేను అనాలికాని. ఆయన అనడం నాకిష్టంవుండదని ఆయనకి తెలుసు. "ఇంటికి వెళ్ళాక యుద్ధం చెయ్యనులెండి. సరిగ్గా చెప్పండి. ఆ అమ్మాయి బాగాలేదా?" అన్నాను

"ఏమో పరీక్షగా చూడలేదు" అని నా కోసం అని. తర్వాత చూసి "అంత గొప్పగా ఏముంది? కాకపోతే మంచి టేస్టు వుంది ఆ అమ్మాయికి. గడ్డం దగర ఆ బ్యూటీస్పాట్ చూడు. అదే ఆ అమ్మాయి మొహానికి అందాన్నిచ్చింది. నువ్వు పెట్టుకుంటే బ్రహ్మాండంగా రాణిస్తుంది" అన్నారు. తర్వాత "ఆ అమ్మాయి అందరిలా కాకుండా కొంచెం పెద్ద బ్యూటీ స్పాట్ పెట్టుకుంది. అందరికీ బాగుండదు కాని, ఈ అమ్మాయికి బాగుంది. నీకు ఇంకా బాగుంటుంది" అన్నారు. అప్పట్నించీ బ్యూటీ స్పాట్ పెట్టుకుంటున్నాను" అంది వరూధిని.

రాధకి మళ్ళీ ఒళ్ళు పులకరించింది. అలా భార్య మనసు అంతరాంతరాలకి కూడా సంతృప్తి నిచ్చేటట్లు మాట్లాడేవాళ్ళెవరున్నారు?

"ఇంతకీ ముందు చెప్పిన కథరైటా ఈ కథరైటా?"

"ఏది బాగుంది?" అంది వరూధిని.

"రెండూ బాగున్నాయి."

"ఏది నిజమైన కథో నువ్వే వూహించు."

రాధ ఊహించలేదు. రెండు కథల్లో ఏ కథనీ వదులుకోవడానికి మనసు ఒప్పలేదు

"రెండూ రైటే" అంది వరూధిని.

రాధకొక అనుమానం వచ్చింది. "అక్కా ఇంకోసారి వచ్చినప్పుడు ఇంకో కథ చెబుతావేమో?" అంది.

"చెబుతానేమో.... అయినా నీ పెళ్ళకుదిరిందిగా ఇంక నా కథలు దేనికి? చెప్పినా విననంటావు."

"ఏం పెళ్ళైతే" అంది రాధ నిస్పృహగా.


అంతకు ముందు నెల రోజుల క్రితం జరిగిన పెళ్ళిచూపుల్లో రాధ రాజారావుని చూసింది. రాజేష్‌లాగా అందగాడు కాడు రాజారావు. సాదాగా వున్నాడు. రాజేష్ లాగా సంపన్నుడూ కాదూ. రాజేష్‌కివున్న సరసమూ ఇతనికి వుండివుండదు.

వరూధిని ఒక్కక్షణం ఆలోచించి "నిన్ను ఇంక ఊరించను. ఈమాటువచ్చినప్పుడు ఇంకో కథ చెబుతాను. ఈమూడింటిలో నిజమైన కథ ఏదని మళ్ళీఅడుగుతావు. నిన్నే ఊహించమంటాను. తెలుసుకుంటావు" అంది.

"నేను తెలుసుకోలేకపోతే?"

"తెలుస్తుంది అంతగా తెలియకపోతే నేను చెప్పేస్తాను" అని మాట ఇచ్చింది వరూధిని.

* * *




డాబామీద వెన్నెల్లో చందమామ కేసి చూస్తున్న రాధకి ఈ విషయాలన్నీ మనసులో తరంగాలా కదులుతున్నాయి.

పక్కన రాజారావు నేడు ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. ఇన్‌స్పెక్షనుట.

"సాయంత్రం అయిదింటికల్లా వచ్చెయ్యండి" అంది రాధ, అంతకు ముందు ఆశగా.

"ఇన్‌స్పెక్షను వుంది" అన్నాడు రాజారావు.

**FOR INDUSTRIOUS AND INTERESTED STUDENTS OF INTERMEDIATE**

Solved Problems in Physical Sciences from previous examination papers and Important Problems with Solution by eminent and experienced authors. Get your Copy immediately by paying Cash or through M. O. Rs-9.

**K. SURESH BABU**

**TWIN CITIES TUTORIALS**

**YMCA., Narayanguda, Hyderabad 29.**

అపురూపమైన అంబడిపూడి పుస్తకాలు
మీ జీవితాన్ని ఆనందమయం చేసుకోండి
శక్తి సాధించండి.

| | |
|---|---|
| సినిమాలో నటించడ మెలా? | రు. 5-00 |
| [డ్రామా, రేడియో, టెలివిజన్ నటించడ మెలా?] | |
| హిప్నోటిజం (అద్భుతశక్తులసాధన) | రు. 4-00 |
| సంకల్పబలం (మానసికశక్తులసాధన) | రు 5-00 |
| మీరూ—మీ శక్తి | రు. 10-00 |
| ఆశది కోరేదేమిటి | రు. 4-00 |
| స్త్రీల నాకర్షించడ మెలా? | రు. 3-00 |
| గర్భము-గర్భనిరోధం (40 చిత్రాలతో) | రు. 5-00 |
| ఉద్రిక్తస్థానాలు-తృప్తికి మార్గాలు | రు. 5-00 |
| వాత్స్యాయన కామశాస్త్రం | రు. 5-00 |
| వ్యాపారాభివృద్ధికి ఏమిచేయాలి | రు. 10-00 |
| హిందీ, అరవం, ఇంగ్లీషు సెట్లు | రు. 15-00 |
| కరాటే సెట్టు (10 పుస్తకాలు) | రు. 30-00 |

డబ్బు ముందుగా పంపితే రిజిష్టర్డు పోస్టులో పంపుతాము. V. P. పద్ధతి లేదు.

జలజ ప్రచురణలు, విజయవాడ-3.

ES WAR

దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొంద లేనివారు,హెర్నియా. చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2

బ్రాంచి: రత్నా టాకీస్‌వద్ద, తెనాలి, ఫోన్: 551

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address
Samaj Kalyan (R.L. 78)
(P. O) Katri sarai (Gaya)

"అయితే మటుకు? ఆఫీసు అవర్స్‌లో పని చెయ్యండి. ఆ ఖుదయేటప్పటికి ఆపేసి మర్నాడు రమ్మని చెప్పండి" అంది మొండిగా.

"నేను ఇన్‌స్పెక్షన్‌చేసే ఆఫీసర్ని కాను. ఇన్‌స్పెక్షను చెయ్యబడే వాళ్ళలో ఒకడిని. నేను చెప్పింది చెల్లదు" అన్నాడు ఓర్పుతో స్పష్టంగా చెబుతూ.

"చెప్పి వచ్చెయ్యలేరా? సాయంత్రం ఎగ్జిబిషన్‌కి వెడదాం" అంది రాధ, తన ధోరణి కొనసాగిస్తూ.

. "నేను స్టేట్‌మెంటు తయారుచేసు కోవాలి" అంటూ వెళ్ళిపోయాడు.

రాధ అసంతృప్తిగానే ఉండి పోయింది.

ఆ రాత్రి రాజారావు వచ్చేసరికి రాత్రి పదకొండు గంటలయింది. అతను అన్నం తినలేదు.

"డాబా మీదికి పోయి కూర్చుందాం వెన్నెల్లో" అంది రాధ. "నాకు అలసటగా వుంది" అని పడుకున్నాడు రాజారావు.

"ఈ మనిషికి సరదాలూలేవు, సరసాలూ లేవు" అనుకుంది రాధ నిద్రపట్టక డాబా మీదికి వెడుతూ.

* * *

డియర్ రాధా!

నేను, అమ్మా నాన్నని చూశటానికి ఇంటికి వచ్చాను మళ్ళీ మా వూరు వెడు తున్నాను. దారిలో మీ వూరు వచ్చి ఒక రోజు ఉంటాను.

ప్రేమతో,
—వరూధిని.

ఉత్తరం చూసి రాధ మనసు ఉరకలు వేసింది.

అనుకున్న టైముకి వరూధిని వచ్చే సింది.

ఒక రోజు పూర్తిగా కబుర్లతో గడిచి పోయింది.

"ఇంకో రోజు ఉండవే" అని రాధ అడిగిందికాని వరూధిని వుండలేనంది.

"నాకు నీ బ్యూటీస్పాట్ కథ ఇంకోటి చెబుతానన్నావు. నిన్నంతా కబుర్లతో గడిచి పోయింది. అది చెప్పటానికయినా ఒక పూట ఉండవే" అంది రాధ.


"ఏరేలే ఉంటాను. కాని మా ఆయన ఎదురుచూస్తుంటారు"

రాధ నిట్టూర్చింది. "నీ కోసం ఎదురు చూసే వాళ్ళున్నారు" అంది.

వరూధిని రాధ కళ్ళలోకి చూసి" ఒక విషయం నిన్ను అడగాలనుకుంటున్నాను" అంది.

"ఏమిటి?"

"నాకు నిజం చెబుతావా?"




"అడుగు. ఏమిటి?"

"నువ్వూ, మరిదీ బాగుంటున్నారా?"

"అంటే?"

"సరదాగ గడుపుతున్నారా?"

రాధ మాట్లాడలేదు

"దెబ్బలాటలు వస్తున్నాయి కదూ?" అంది వరూధిని.

"…. …."

"సంసారం నీకు అసంతృప్తిగా వుంది— అవునా?"

"…. …. …. …."

"దానివల్ల అతనికీ అసంతృప్తి కలుగు తోంది. అవునా?" రాధ అప్పటికీ మాట్లాడ లేదు.

"అమ్మ, బామ్మ వచ్చి ఇక్కడ పది రోజులు ఉన్నారట గా. అప్పుడు చూసిన విషయాలు అమ్మ చెప్పింది."

రాధ మాట్లాడ లేదు.

వరూధిని రాధ కళ్ళలోకి ప్రేమగా చూసి "రాధా, మధ్య తరగతి సంసారా లంటే నీకు అవగాహన లేదు. మగవాడి జీతం, తాహతునిబట్టి ఆడవాళ్ళ కోరికలు ఉండాలి. అతడి తీరికనిబట్టే సరదాలు తీర్చుకోవాలి. మన సరదాలు మగవాడికి బ్యూటీ చెయ్యకూడదు వాళ్ళకి ఒక బ్యూటీ ఎలాగా ఉంది. మొగుడి పరిధిలోనే ఆనంది వి సరించుకోవాలి. సంసారాల్లో సంతోషం ముందే అమర్చినటుగా ఉండదు వెత క్కోవాలి, సృష్టించుకోవాలి" అంది.

రాధ మౌనంగానే వుంది.

"నీకు మొదట్లో పెళ్ళి అంటే అంత ఇష్టం వుండేది కాదు. అందుకని అప్పట్లో ఇష్టం పుట్టించే కబురే చెప్పేదాన్ని. ఇప్పుడు నువ్వు పెళ్ళయినదానివి. నీకిప్పుడు చెప్పాల్సిన వాస్తవాలు ఇప్పుడు చెబుతున్నాను. ఆ పైన నీ ఇష్టం. నీకుమరీ ఊహలెక్కువ" అంది వరూధిని.

రాధకి ఉక్రోషం వచ్చేసింది. "ఆరొందలు జీతంతో రాత్రి తొమ్మిదింటిదాకా చాకిరీచేసే మొగుడితో జీవితం సుఖంగా గడిచిపోతుందంటావా? బావగారి లాంటి భర్త నాకూ వుంటే నేనూ కబుర్లు, నీతులు చెప్పేదాన్ని" అంది.

వరూధిని జీవం లేని నవ్వు నవ్వింది.

"పోనీలే ఆ ప్రసక్తి వదిలెయ్. నామనసుకి తోచినమాట చెప్పాను. నీకు కష్టంగా వుంటే మర్చిపో. ........ అది సరేగాని నా గడ్డంమీద బ్యూటీస్పాట్ నిజంగా బాగుందిటే?" అంది మాట మారుస్తూ.

రాధ క్రమంగా ప్రసన్నం అయింది. "బాగుందనేగా చెబుతున్నది. నాకూ కూడా పెట్టుకోవాలనిపించింది. మా ఆయన అడిగితే పెట్టుకుందామనుకున్నాను. ఆయన అడగందే!" అంది రాధ బేలగా.

"వద్దు. అడిగినా పెటుకోవద్దు. నీకు నప్పదు" అంది వరూధిని.

"నా మొహానికి బాగుండదా?" అంది రాధ అమాయకంగా.

"ఇంత పెద్దది బాగుండదు. చిన్నది పెట్టుకోవచ్చు"

"సరేగానీ బ్యూటీస్పాట్ గురించి ఇంకోకథ చెబుతానన్నావు. చెప్పవూ?" అంది రాధ ఆశగా.

"చెబుదా మనుకుంటూవుంటే నువ్వే అడిగేశావు. చెప్పే సమయం కూడా వచ్చింది. ఈమాటు యింకో కథకాదు. అసలు కథే చెబుతాను.

ఆ రోజు వెన్నెల రోజు కాదు. మేము డాబామీద కూర్చోలేదు. చుక్కలు, చందమామ కేసి చూడటంలేదు. అంతకుముందు ఏ పుట్టిన రోజు పార్టీకీ వెళ్ళిరాలేదు.

నేను గదిలో కూర్చుని లేసు అల్లుకుంటూ మీ బావగారికోసం చూస్తున్నాను. రాత్రి పదకొండింటికి వచ్చారు. వస్తూంటే గుప్పుమని వాసన కొట్టింది. అది నాకు అలవాటే. నెమ్మదిగా డ్రస్సుమార్చి పడుకోబెట్టాను. అన్నం తినలేదు. మజ్జిగ ఇస్తానంటే వద్దని కసిరారు, మైకం దిగిపోతుందట.

అంతవరకూ బాగానే వుంది. ఆ రోజు రాత్రి కలవరింతలు. రోజూ వేరే గదిలో పడుకుంటాను కాబట్టి, ఆ కలవరింతల సంగతి అప్పటిదాకా నాకు తెలియలేదు. ఆరోజు తాగుడు వికారంతో కక్కుకుంటున్నారని ఆయన గదిలోనే పక్కన పడుకున్నాను. "తారా", "తారా" అంటూ కలవరింతలు. నాకు వొళ్ళు మండిపోయింది. అప్పటిదాకా రాత్రిళ్ళు ఆలస్యంగా వస్తే సహించాను. తాగితే భరించగలిగాను. ఇది మాత్రం తట్టుకోలేకపోయాను. నిద్రలేపి "ఎవరా తార?" అని అడిగాను. లేవగానే అలవాటుగా సిగరెట్టు వెలిగించి "ఎవరైతే నీకెందుకు? నీ కన్నా బాగుంటుంది" అన్నారు నిర్లక్ష్యంగా. "నాకన్నా అదే బాగుంటే దాని దగ్గరే వుండండి. ఇలాంటి బుద్ధి వున్నవాళ్ళకి అందమైన పెళ్ళాలెందుకూ?" అన్నాను. ఆయనకి తిక్క కోపం వచ్చేసింది. "ఏమిటే నీ వాగుడు? నీదో పెద్ద అందమా? దానితో నీకు పోలికా? నీ అందం గతి చూద్దువుగాని" అంటూ ఎర్రగా కాలుతున్న సిగరెట్టు గడ్డంమీద పెట్టారు. చుర్రుమని కాలింది. కెవ్వుమని కేక పెట్టాను "ఇప్పుడు అద్దంలో చూసుకో నువ్వెంత బాగున్నావో" అన్నారు- ఎర్రగావున్న కళ్ళతో వెకిలిగా చూస్తూ.

అద్దంలో చూసుకున్నాను. గడ్డం దగ్గర కాలిన గాయం.

తర్వాత గాయం మానినా మచ్చ మానలేదు. ఆ మచ్చ కనిపించకుండా ఉండటానికే దానిమీద చుక్కబొట్టు పెట్టాను అందుకే అంత పెద్దసైజుంది. ఆయన దగ్గర ఉన్నప్పుడు మాత్రం బొట్టు పెట్టుకోకుండా మచ్చలాగే ఉంచుతాను. బొట్టు అందంగా పెట్టి నా ముఖం అందంగా కనిపిస్తే కోపంవచ్చి ఇంకో బ్యూటీస్పాట్ పెడతారు. పెద్దది అయినా ఒక్క బ్యూటీస్పాట్ అయితే నా మొహానికి బాగుంది కాని, రెండు బ్యూటీస్పాట్లు బాగుండవు" అంది వరూధిని.

విస్మయంగా తెరలు తొలగినట్లుగా చూసిన రాధ స్థబ్దురాలై వుండిపోయింది.

వరూధిని ఏడుస్తోంది. ★

ధైర్యే సాహసే సరస్వతీ!
మీరు ఉత్సాహంగా వ్రాసిన వాటిల్లో
యోగ్యమైనవి ఎంచుకొని
వారం వారం ప్రకటిస్తాం!
(అన్నిట్లో స్వల్ప పారితోషికం కూడా
ఉంటుంది)
మీ బుల్లి బుల్లి రచనలు
ఎడిటర్ —
(ఆంధ్రజ్యోతి సచిత్ర) వారపత్రిక
పోస్టుబాక్సు నెం. 712
విజయవాడ-520 010 కి
పంపించాలి

